క్లుప్తంగా

మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): స్థానిక టౌన్ మోడల్ హైస్కూల్‌లో శనివారం పోష్ యాక్ట్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకటహరినాథ్ పాల్గొన్నారు. పనిచేసే ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, హింసల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులపై కమిటీలు ఏర్పాటయ్యాయని, 2013లో వచ్చిన చట్టంతో అవి మరింత బలోపేతం అయ్యాయని తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వేధింపులపై ఫిర్యాదు చేయాలన్నారు. సదస్సులో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు యాదవుల కార్తీక వన భోజనాలు

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న రూపాల సంగమేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం యాదవుల కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు జి.సోమన్నయాదవ్, జి.సదానంద యాదవ్ తెలిపారు. శనివారం వారు సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. కార్తీక మాసం మానవాళికి పవిత్రమైన మాసమని, ఈ మాసంలో చన్నీటి స్నానం, జపం, ఉపవాసం, దానం, దీపారాధాన అద్భుతమైన కార్యాలని చెప్పారు. ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే సర్వరోగాలు నయమవుతాయన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచి జగన్నాథగట్టుపైకి ఉచిత వాహన సదుపాయం కల్పిస్తామని, యాదవులందరూ కుటుంబసమేతంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అక్రమ నాపరాయి రవాణా లారీలు సీజ్

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా నాపరాయిని తరలించే రెండు లారీలను సీజ్ చేసినట్లు మైనింగ్ డీడీ రవిచంద్ తెలిపారు. శనివారం కొలిమిగుండ్ల నుంచి మహారాష్ట్రకు నాపరాయిని తరలిస్తుండగా కర్నూలు బైపాస్‌లో మైనింగ్ సిబ్బంది చేపట్టిన తనిఖీలలో లారీలు పట్టుబడినట్ల తెలిపారు. వాటిపై కేసు నమోదు చేసి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. సంబంధిత లారీ యజమానులపై పెనాల్టీలు వేసి తదుపరి చర్యలు చేపడతామన్నారు. తనిఖీలలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు హసీనాభాను, బాలు నాయక్ పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాలలో ముగిసిన అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. గాత్రం, వయోలిన్, నాద స్వరం, మృదంగం, కూచిపుడి కోర్సుల్లో ప్రవేశాలు పెరిగాయన్నారు. గత ఏడాది 360 అడ్మిషన్లు జరిగితే ఈ ఏడా ది 375 అడ్మిషన్లు వచ్చాయని పేర్కొన్నారు. విద్యార్థు లు, ఉద్యోగులకు అనుకూలంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో తరగతులు ఉంటాయన్నారు.

వ్యాసరచన పోటీలు

కర్నూలు (లీగల్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి ఆదేశాల మేరకు సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకటహరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ శనివారం టౌన్‌మోడల్ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 14 నుంచి బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'బాలల హక్కులు – న్యాయ సేవ – భారత రాజ్యాంగం' అంశంపై పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారికి ఈనెల 20న జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సేవాధికార సంస్థలో జిల్లా జడ్జి చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

35 మంది రైతులకు యూరియా పంపిణీ

కర్నూలు (అగ్రికల్చర్): నగర శివారులోని పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార పతకాన్ని సహకార శాఖ కర్నూలు డివిజన్ అధికారి షేక్ జఫ్రీన్ ఆవిష్కరించారు. సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత రెడ్డి, సీఈఓ మురళీధర్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సహకార వారోత్సవాల విశిష్టతను, సహకార వ్యవస్థ అవసరంపై అవగాహన కల్పించారు. సహకార వ్యవస్థపై సహకార సంఘాలు మరింత నమ్మకాన్ని పెంచుతున్నాయన్నారు. ఈ సందర్భంగా 35 మంది రైతులకు ఇఫ్కో నానో యూరియా పంపిణీ చేశారు.

మెదడులో కల్లోలం

- మూర్ఛ వ్యాధితో కలకలం
- జిల్లాలో 3 శాతం మందికి సమస్య
- జిల్లాలో 15 వేల మందికి పైగా మూర్ఛ రోగులు
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు, మందులు, చికిత్స
- నేడు జాతీయ మూర్ఛ వ్యాధి అవగాహన దినం

సాదాసీదాగా రోడ్డుపై వెళ్తున్న వారు ఉన్నట్లుండి కింద పడి కాళ్లు, చేతులు కొట్టుకుంటూ, పళ్లు బిగబట్టి గట్టిగా అరుస్తూ, నోట్లో నురగలు కక్కుతూ కనిపిస్తారు. కొన్ని నిమిషాలకే వారు మళ్లీ సాధారణంగా మారి నడుచుకుంటూ వెళ్లిపోతారు. దీనినే మూర్ఛ/ఫిట్స్ అని పిలుస్తారు. వైద్యపరిభాషలో ఎలిలెప్సీగా పేర్కొంటారు. ఈనెల 17న జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)



పెద్దాస్పత్రిలోని న్యూరాలజీ విభాగంలో ఈఈజీ పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి సోమ, గురువారాల్లో 200 నుంచి 250 మంది చొప్పున చికిత్స కోసం వస్తారు. వీరిలో 20 శాతం మంది మూర్ఛవ్యాధి బాధితులుంటున్నారు. ఈ విభాగంలో ఐపీ సేవలతోపాటు ఈఈజీ, ఎపిలెప్సీ స్టడీ సేవలు కూడా లభిస్తున్నాయి. ఈ పరీక్షలు నెలకు 250, ఏడాదికి 3వేల మందికి చేస్తున్నారు. ప్రైవేటుగా ఈ పరీక్షలు చేయించుకోవాలంటే ఒక్కొక్కరికి రూ.2 వేలకు పైగా ఖర్చవుతుంది. అవసరమైన వారికి ఎంఆర్‌ఐ, వీడియో ఈఈజీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక్కడే గాక జిల్లా మొత్తంగా సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రులల్లో వైద్యుల వద్దకు వెళ్లే వారు ప్రతి నెలా మరో 8వేల మంది ఉంటారని అంచనా. మూర్ఛవ్యాధికి నాటు మందు తీసుకునే వారు కూడా ఉన్నారు.

మూర్ఛ వ్యాధి ఎలా వస్తుందంటే...!

మూర్ఛ(ఫిట్స్) అంటే మానవ కేంద్రీయ నాడీ వ్యవస్థ రుగ్మతల సమూహం. మెదడులోని ఎలక్ట్రిక్ యాక్టివిటి అసాధారణ పగుళ్ల వల్ల ఇది సంభవిస్తుంది. మూర్ఛలకు కారణం వాటి కేంద్ర స్థానాన్ని బట్టి వర్గీకరించవచ్చు. మూర్ఛలు తరచుగా కన్వల్షన్స్ లేదా ఎపిలెప్టిక్ ఫిట్స్‌గా సూచిస్తారు. ఇది సున్నా నుంచి 10 ఏళ్లలోపు, 50 నుంచి 70 ఏళ్లలోపు వారికి కలుగుతుంది. ఒక్కోసారి ఏ వయస్సులో వారికైనా రావచ్చు. వంశపారంపర్యం, మెనింజైటిస్, రక్తంలో షుగర్ శాతం పెరగడం, తగ్గడం , మెదడుకు గాయాలైనప్పుడు, గడ్డలు ఉన్నప్పుడు, రక్తంలోని కొన్ని ఆటో ఇమ్యూన్ కారణాల వల్ల మూర్ఛ వస్తుంది.

మూర్ఛల్లో రకాలు–లక్షణాలు

సాధారణ మూర్ఛలో మెదడు చాలా వరకు దెబ్బతింటుంది. టానిక్ క్లోనిక్‌లో ఆకస్మికంగా స్పృహ కోల్పోవచ్చు. రోగి పడిపోవడం, చేతులు, కాళ్లు కొట్టుకోవడం చేస్తారు. ఆబ్సెన్స్ లేక సెటిల్ మాలో మూర్ఛలో స్పృహ స్వల్పకాలంపాటు కోల్పోతారు. ఈ దశలో రోగి కొంత కాలం పాటు శూన్యంలోకి చూస్తూ ఉంటారు. మయోక్లోనిక్ మూర్ఛలో ఆకస్మిక, సంక్షిప్త కండరాలు సంకోచాలు సంభవిస్తాయి. ఇవి మొత్తం శరీరమంతా లేదా కొన్ని భాగాలకు సంభవిస్తాయి. ఆటోనిక్ మూర్ఛలలో ఆకస్మిక విచ్ఛిన్నం సంభవిస్తుంది. ఆ తర్వాత తక్షణమే కోలుకుంటారు. సరళమైన ఫోకల్ మూర్ఛలో రోగికి చేతులలో, కాళ్లల్లో కండరాల లాగుట కనిపిస్తుంది. లేదా వినికిడి, దృశ్యం, వాసన, రుచిలో ఆటంకం కలగవచ్చు. సంక్లిష్ట ఫోకల్ మూర్ఛలో రోగి స్పృహ కోల్పోతాడు. రోగికి విచిత్రమైన ప్రవర్తన ఉన్నట్లుగా కనిపిస్తాడు. కొన్ని సెకన్లు, నిమిషాల పాటు ప్రతిస్పందన లేకుండా ఉన్నట్లు కనిపిస్తుంది. సూక్ష్మ ముడతలు, లేదా ముఖం, చేతులు, కాళ్లు తరచూ లాగుతుంటాయి.

మూర్ఛవ్యాధి నిర్ధారణ

మూర్ఛ పేరుతో వైద్యుని వద్దకు వచ్చిన వెంటనే అతని పక్కన ఉన్న వ్యక్తితో జరిగిన సంఘటన గురించి వైద్యులు ఆరా తీసి అది మూర్ఛనా కాదా అని నిర్ధారిస్తారు. నిర్ధారణ కోసం అవసరమైతే సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఈఈజీ పరీక్షలు చేయిస్తారు. కొన్నిసార్లు వీడియో ఈఈజీ పరీక్ష కూడా చేయాల్సి రావచ్చు. వీటి ద్వారా మెదడులోని ఏ భాగం దెబ్బతినడం వల్ల మూర్ఛ వస్తుందో గుర్తిస్తారు.

మూర్ఛ వచ్చినప్పుడు చేయాల్సినవి

- ప్రశాంతంగా ఉండాలి.
- ప్రమాదాన్ని అంచనా వేసి లేదా ప్రమాదంలో ఉంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.
- తలను రక్షించాలి. మెడ చుట్టూ ఉన్న గట్టి దుస్తులు తీసేయాలి. కళ్లజోడు ఉంటే తొలగించాలి.
- సహాయక శ్వాసను పూర్తి చేసిన తర్వాత వారిని మెల్లగా రికవరీ స్థానంలో ఉంచాలి.
- రికవరీ పూర్తయ్యేవరకు వారితోనే ఉండాలి.
- వారికి భరోసా ఇవ్వాలి. తిరిగి మాటలతో ధైర్యం చెప్పాలి. మూర్ఛ ఉందని చెప్పకూడదు.
- అవసరమైతే ఆ వ్యక్తికి విశ్రాంతి/నిద్ర పోనివ్వాలి.

మూర్ఛవచ్చినప్పుడు చేయకూడనివి.

- చెంచా(స్పూన్)లతో నీటిని నోట్లో పోయకూడదు.
- వారి చేతులను అదిమి పట్టుకోవద్దు.
- నోటిలో ఏదైనా చొప్పించేందుకు ప్రయత్నించవద్దు. అది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగిస్తుంది. సహాయకుడి వేళ్లను కూడా గాయపరుస్తుంది.
- వారి చుట్టూ ఎక్కువ మంది గుమికూడవద్దు.
- నీరు, పానియాలు ఇవ్వవద్దు.
- వారు కదులుతున్నప్పుడు పట్టుకోవద్దు, ఇది చాలా ప్రమాదకరం.
- ఆ వ్యక్తి నీటిలో ఉన్నప్పుడు జాగ్రత్తగా చూడాలి. నోటి నుంచి నురగరావచ్చు. అది రెండు నిమిషాలకంటే ఎక్కువ సమయం ఉండదు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



మూర్ఛ వ్యాధిగ్రస్తులు రెగ్యులర్‌గా మందులు వాడాలి. మధ్యలో మందులు ఆపకూడదు. ఇలా వాడితే కొంత కాలానికి వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ఆల్కాహాలు తీసుకోకూడదు. 75 శాతం మందికి మందులతో పూర్తిగా నయమవుతుంది. కేవలం 25 శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది. ఈ ఆపరేషన్‌ను ఒకప్పుడు కేరళలోని శ్రీచిత్ర ఆసుపత్రిలో చేసేవారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని నిమ్స్, ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రులతోపాటు అక్కడి ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా చేస్తున్నారు. అయితే ఆపరేషన్ కంటే ఎక్కువ మంది మందులు వాడటానికే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యపరీక్షలు, చికిత్స, మందులు ఉచితంగా అందజేస్తున్నాం.

– డాక్టర్ సి.శ్రీనివాసులు, న్యూరాలజీ హెచ్‌ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఈ రోజు

నగర సంకీర్తన

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన కార్యక్రమం ఉంటుందని ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక ప్రభు తెలిపారు. వన్‌టౌన్ గీతా మందిరం నుంచి మహా నగర సంకీర్తన ప్రారంభమవుతుందన్నారు. ఇస్కాన్ భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటలకు భగీరథ కాంప్లెక్స్‌లో పూరీ జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాద ప్రేమ విందు, భగవద్గీత తరగతులు ఉంటాయన్నారు.

సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారిచే ×ఇది రహదారి కాదు₹ సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని టీజీఈ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహించనున్నట్లు మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని, మరిన్ని వివరాలకు 98485 63096 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

18న బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 18న స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–19 జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే ఈనెల 20న బేస్ బాల్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు.

రోడ్లపై బంకులను తొలగించండి



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి

- కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు మేయర్ బీవై రామయ్య ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): నగరంలో టీడీపీ నాయకులు మంత్రి పేరు చెప్పి రోడ్లపైనే అక్రమంగా బంకులు అక్రమిస్తున్నారని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ బీవై రామయ్య కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. శనివారం ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని సీక్యాంపులో ఉన్న బస్‌స్టాప్‌ను టీడీపీ నాయకులు ఆక్రమించి వ్యాపారం కోసం బంకులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇక్కడి నుంచి రోజుకు వేలాది మంది మహిళలు, ఇతర ప్రయాణికులు నందికొట్కూరు, నంద్యాల, ఆత్మకూరుల వైపు వెళ్తుంటారని, ఇక్కడ బంకులు వేయడంతో వారికి ఇబ్బందిగా మారుతుందన్నారు. బంకులు వేసిన సమీపంలోనే మహిళల టాయిలెట్లు ఉన్నాయని, పాఠశాలల ప్రహరీని ఆక్రమించి వేసుకోవడంతో ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు స్పందించి బంకులను తొలగించకపోతే నగరంలోని ఖాళీ ప్రదేశాల్లో తమ కార్యకర్తలతో బంకులు వేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, ఇంద్రసేనారెడ్డి, కృష్ణకాంత్‌రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, జుబేర్, యూనూస్, లక్ష్మీకాంత రెడ్డి, షేక్షావలి, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్) : సి.క్యాంపు రద్దీ ప్రాంతంలో బంకులు వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారంటూ పలువురు ఫోన్లు చేయడంతో శనివారం వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై.రామయ్య కార్పొరేటర్లతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు కర్నూలు నగరంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా బంకులు వేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ హయాంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో స్ట్రీట్ మార్కెట్‌లు ఏర్పాటు చేస్తే.. వాటిని కాదని రోడ్లను ఆక్రమించి టీడీపీ నాయకులు బంకులు వేసుకోవడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులు తగవు

కర్నూలు(సెంట్రల్): ఆదోని మండలం పాండవగల్లు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరమ్మపై రాజకీయ వేధింపులు తగవని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన కలెక్టర్‌కు వీరమ్మ దుస్థితిపై లేఖ రాశారు. 12 ఏళ్లుగా పనిచేస్తున్న వీరమ్మను తప్పుకోవాలని కూటమి నాయకులు వేధించడం అన్యాయమన్నారు. ఆమెను వేధిస్తున్న వారిపై పోలీసు కేసు నమోదు చేయాలని కోరారు.

18న కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(సెంట్రల్): పేదల ఇళ్ల నిర్మాణాలకు స్థలంతోపాటు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్వామిరెడ్డి నగర్, టీవీ9 నగర్, గిరిప్రసాద నగర్, బుధవారపేట, పూలసుబ్బయ్య నగర్, ఎన్‌జీ నగర్, రామచంద్రనగర్, కస్తూరినగర్, షరీఫ్ నగర్‌లలో సీపీఐ నాయకులు ఇళ్ల స్థలాల కోసం 18న కలెక్టరేట్ ముట్టడికి తరలి రావాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం 3 సెంట్ల స్థలం ఇస్తామని వాగ్దానం చేసి పట్టించుకోకుండా ఉన్నారని విమర్శించారు. ఆయనకు పేదల గోడును గుర్తు చేసేందుకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, గౌడ్, కోటమ్మ, శైలజ, అమినాబీ, కుమార్, నీలకంఠప్ప, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం



సమావేశంలో పాల్గొన్న వైఎస్‌ఆర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ నాయకులు

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని ఏపీఎస్‌ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని వైఎస్‌ఆర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సూచించారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగన్న, జోనల్ నాయకులు శ్రీపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, రాబర్ట్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బి.ఎల్ శాస్త్రీ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీలు లేని డిపోలలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. త్వరలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఉద్యోగులతో భారీ ఎత్తున సమావేశం నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నామన్నారు. వైఎస్‌ఆర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ లేదని పెద్ద సంఘాలుగా చెప్పుకునే వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పెద్ద సంఘాలుగా చెప్పుకుంటున్న ఆ సంఘాల నాయకులు ఏ రోజు ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేయలేదన్నారు. సమావేశంలో అసోసియేషన్ మహిళ విభాగం నాయకురాలు హంసవేణి, లక్ష్మీదేవి, సుధాకర్, ఈశ్వరయ్య గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ఎస్‌ఈతో చర్చిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. శనివారం నగరపాలక ఎస్‌ఈ రాజశేఖర్‌తో కలిసి సుంకేసుల రోడ్డులోని పాత పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి దాహార్తిని తీర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పాత పంప్ హౌస్ వద్ద 3 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నూతన నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం ఖానా–ఖజానాను పరిశీలించారు. బిర్లా కాంపౌండ్ నుంచి సిల్వర్ జూబ్లీ కళాశాల వైపునకు వెళ్లే రహదారిలో అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ మనోహర్ రెడ్డి ఉన్నారు.

గ్రంథాలయోద్యమ నాయకుల సేవలు చిరస్మరణీయం




మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ ఉద్యమ నాయకుల సేవలు చిర స్మరణీయమని జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.దీప్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మూడో రోజు శనివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను అర్థం చేసుకుంటూ చదవడం అలవర్చుకోవాలన్నారు. నిత్యం పుస్తక పఠనంతో మేదస్సు పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ విజ్ఞానార్జనకు గ్రంథాలయాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ సెక్రటరీ పెద్దక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్లు ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిలేష్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు మద్దిలేటి, చిత్రలేఖన ఉపాధ్యాయులు సుధీర్, అసిస్టెంట్ లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, చంద్రమ్మ, నసీమా, రేణుక పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఎంపికైన వారి జాబితా

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది, వార్డెన్లు, పార్ట్‌టైం టీచర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను htt pr://rvmssakurnool. blogspot.comలో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్‌పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 18న డీఈఓ ఆఫీస్ పైభాగంలో ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

న్యూమోనియాపై అప్రమత్తంగా ఉండాలి



న్యూమోనియా గురించి అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): చిన్నారుల్లో న్యూమోనియా పట్ల అప్రమత్తంగా ఉండాలని డెమో శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక జొహరాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 32వ సచివాలయం బుధవారపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో న్యూమోనియాపై అవగాహన కల్పించారు. ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు సాన్స్ క్యాంపెయిన్ ఇంటింటి సర్వే నిర్వహించాలని, దీని ప్రధాన ఉద్దేశం చిన్నారుల్లో న్యూమోనియా నివారించేందుకు, ప్రజలకు న్యూమోనియా లక్షణాలు, చికిత్స, నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా కార్యకర్తలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి అప్పుడే జన్మించిన పిల్లల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరినీ పరీక్షించి అవసరమైతే చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖరరెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు లక్ష్మీదేవి, విద్యావతి, ఆశా కార్యకర్తలు ఉమా, ప్రభావతమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఫీజుకు 13,079 మంది రెన్యువల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ పెండింగ్

- 30లోగా రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి
- జేడీ జె.రంగలక్ష్మి దేవి

కర్నూలు (అర్బన్): జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ, డిసబుల్డ్ విద్యార్థులు 13,079 మంది రెన్యువల్ రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్నదని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మి దేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు మొత్తం 32,687 మంది విద్యార్థులు అర్హులు కాగా వీరిలో 302 మంది డిస్ కంటిన్యూ అయ్యారన్నారు. మిగిలిన వారిలో 19,307 మంది మాత్రమే ఆయా కళాశాలల జ్ఞాన భూమి లాగిన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మిగిలిన రెన్యువల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరానికి ఫ్రెష్ రిజిస్ట్రేషన్ 11,389 మంది విద్యార్థులు ఆయా కళాశాలల లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 2,828 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మిగిలిన విద్యార్థులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తయిన విద్యార్థుల్లో 22,135 మంది కళాశాల లాగిన్‌లలో ఆధార్ అథెంటికేషన్, 12,920 మంది ప్రిన్సిపల్స్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకునేందుకు htt p://j na na bh umiv2.a pc-frr.i n వెబ్‌సైట్ పోర్టల్‌లో కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో ఆప్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సాంకేతికపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఆయా విభాగాలకు ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. ఎస్సీ విద్యార్థులకు మాహేశ్వర్‌రెడ్డి, డీపీఎంయూ–9160139186, ఎస్టీ విద్యార్థులకు లీలావతి, డీపీఎంయూ–8328001559, బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు భాను, డీపీఎంయూ–8639339659, మైనార్టీ విద్యార్థులకు మహబూబ్, ఫీల్డ్ అసిస్టెంట్–9848864449 నెంబర్లలో కార్యాలయ సమయాల్లో సంప్రదించాలన్నారు.

యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్

కర్నూలు (అర్బన్): యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు తమ కార్యాలయంలో దరఖాస్తులను తీసుకుని పూర్తి చేసి రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు తదితర జిరాక్స్ కాపీలతో ఈనెల 24వ తేదీ లోపు అందజేయాలన్నారు. అభ్యర్థుల ఎంపికకు ఈనెల 27వ స్క్రీనింగ్ టెస్టు ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ, బస, వసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు బిర్లా గేట్ సమీపంలోని సంక్షేమ భవన్‌లో ఉన్న బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

22న జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 22న స్థానిక స్పోర్ట్స్ అథా రిటీ స్టేడియంలో జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీ లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షులు నాగరత్నమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన ఆర్చరీ క్రీడాకారులు వచ్చే నెల2 విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 9393855460 ను సంప్రదించాలన్నారు.